# ఖయిదీ... జవానూ

బరువైన లారీ ఇత్తడిమొన నెత్తిన ఠంగున మోగేదాకా, వెడల్పాటి తోలుపటకా కొనలు ఒంటిమీద చురుక్కున సోకేదాకా సబ్‌జైలు పిట్టగోడ ఆవరణమీదనించీ తప్పిపోతున్న జకరయ్యకి తను దొరికిపోయిన సంగతి తెలిసిరాలేదు. జమ్మిచెట్టు నీడలోనించీ జరజరా లాక్కొచ్చి నిండిన బస్తాని గోడవునులో విసిరినట్టు దొరికిన దొంగని కటకటాల వెనక్కి నెట్టి తాళంవేసి, తుపాకీ మొన గురిచూపించి ట్రిగ్గర్‌మీద బెదిరింపుగా వేలుంచి తీక్షణంగా చూసాడు జవాను వెంకటప్పయ్య ఖయిదీ వంక. పారిపోయిన దొంగ దొరికేదాకా తను పడ్డ అలజడి, ఆందోళనా దొంగ దొరికిం తరవాత శౌర్యమూ, సాహసమూ, చాకచక్యం కిందమార్చుకొని గార్డు జవాను వెంకటప్పయ్య పోలీసు పోజిచ్చి నిలబడి పోచీలలో రౌండ్లు సరిదిద్దుకొన్నాడు. దొరికిపోయానే అన్న దుగ్ధలో నెత్తిన ఎక్కడ బొప్పికట్టిందో, మక్కి లెక్కడ విరిగినయ్యో ఖయిదీ జకరయ్య ఆరా చూచుకోలేదు. చేతికందివచ్చిన అదృష్టం వేళ్లలోనే దిగజారిపోయినట్టయి, ఖయిదీ జకరయ్య వొక క్షణం దిగాలుపడిపోయి, మరుక్షణం అవమానం పొందినా, అంతలో తేరుకుని మనస్సు మనస్సులోకి తెచ్చుకుని 'ఈసారికి పైచెయ్యి నీదేలే' అన్నట్టు ఓరకంట గార్డు జవానువంక చూచి అతి భయంగా వున్నట్టు బిక్కుబిక్కుమంటో ముడుచుకుపోయి ఆఖరితట్ట వరసకి సిద్ధమై అదో వొదుపుగా కటకటాల మీదనే వొరిగిపోయాడు. ఆ భయంలో, ఆ జంకులో నటనకింద ఎంత తీసివెయ్యాలో ఇరవయ్యేళ్ల సర్వీసులో అలవాటుపడ్డ వెంకటప్పయ్యకి ఆ చూపులో 'ముందున్నదిలే ముసళ్ల పండుగ' అన్న సామెత నగ్నంగా స్ఫురించింది. ఏమాత్రం ఏమరిలినా ఇక లాభం లేదనిపించింది అతగాడికి.

దొంగదొరికినా, పారిపోతే తన బతుకెంత ప్రమాదానికి గురి అయ్యేదో తలుచుకుంటే జవాను వెంకటప్పయ్యకి ఎముకలలోనించీ వొణుకు పుట్టుకొచ్చింది. వారం రోజులు కాలేదు. ఇన్స్పెక్టర్ జనరల్ దగ్గరనించీ జిల్లా పోలీసు ఆఫీసుకి సర్క్యులర్ వచ్చింది. అక్కణ్ణించీ స్టెన్సిలు కాపీ స్టేషనుకివస్తే రైటరు ముసలయ్య తెలుగున రాసి నోటీసు బోర్డుమీద అంటించాడు. పోలీసు నిగాలోనించీ నేరస్తుడు పరారీ అయినాడూ అంటేచాలు. కాపలా జవానులికి సంజాయిషీ ఇచ్చి తక్షణం డిస్‌మిసల్‌కి లోపు శిక్ష విధించవద్దన్న ఉత్తరువులవి.

అమావాశ్యనాడు అర్ధరాత్రివేళ కడుపులో దేవినట్టున్నదని ఖయిదీ జకరయ్య నటన ప్రారంభించగానే అనుమానం రేకెత్తింది. వెంకటప్పయ్య మొదట్లో తుపాకీ దబాయించి ఆవలిస్తూ చిటికలువేసి కళ్లునులుపుకున్నంతలో వుడాయించాడు రాస్కెల్. ఇంకా నయం ఆ చీకటి మెలికలలో, స్టేషన్ని అంటిపెట్టుకునివున్న ఇరుకుగల్లీల తికమక దారులలో పిట్ట చేయి జారిపోయిందనే అనుకున్నాడు. తన దరిద్ర రేఖలో కొసమెరుపు లేవో వున్నాయిగావును లేకపోతే కొంప నడికొప్పుదాకా మునిగిపోయేది అనుకున్నాడు జవాన్ వెంకటప్పయ్య. అదృష్టవశాత్తు దొంగదొరికాడు. జకరయ్య మంచి బలశాలి. తన చేతులోంచీ తుపాకీ లాగి ఎదురుపేల్చగల తెగువరి. ఆ పెనుగులాట చూచిన గార్డు జవానులంతా "ఎంత సాహసివిరా" అని జబ్బలుచరిచి ఆకాశాని కెత్తారు వెంకటప్పయ్యని... కాని తన చొరవకి కారణమేదో వెంకటప్పయ్యకి మాత్రమే తెలుసు. దొంగ చేతిలో చస్తే కొంత నయం. డ్యూటీ చేస్తూ వీరోచితంగా ప్రాణాలర్పించాడని రికార్డులో పడుతుంది. కుటుంబానికి భరణంకింద అంతో యింతో మంజూరుచేస్తుంది గవర్నమెంటు. కాని దొంగని పిరికితనంగా వొదిలాడా తన నోట్లోను తన పిల్లలనోట్లోనూ సమానంగా మట్టిపడుతుంది. అన్నానికి మొహంవాచి ఆలోలక్ష్మణా అంటూ భార్యా బిడ్డలు అంగుళం అంగుళం మాడి కృశించి చావాలిశొచ్చేది. ఈ కరువురోజులలో పాతికేళ్ళ సర్వీసు గంగలో కలిసిపోగా ఈనమోపైవున్న పైరుమీద ఏటి మునక వొచ్చినట్టు వీధిన పడేది బ్రతుకంతా.

గండంగడిచి గట్టెక్కిం తరవాత మామూలుమనిషయ్యాడు జవాను వెంకటప్పయ్య. బారెడు పొద్దెక్కింది. రాత్తిరంతా పారిపోయేందుకు స్కీము అల్లడంలో కంటికి కునుకులేదేమో బద్ధకంగా లేచాడు ఖయిదీ జకరయ్య. "ఎట్లా వుందిరా. పొగరు దిగిందా" అని కళ్లెగరేశాడు జవాను వెంకటప్పయ్య. గుడ్లురిమి చూసాడు ఖయిదీ జకరయ్య.

వడసారంపిల్ల నాగులు మరచెంబుతో కాఫీ తీసుకొచ్చింది పోలీసు లైనులోనించీ సెంట్రీజవాను వెంకటప్పయ్యకి. కాఫీ తండ్రిచేతి కందించి బిక్కు బిక్కుమంటో చూసింది పోలీసు లాకప్‌లోవున్న ఖయిదీ జకరయ్య వంక. కాఫీ తాగుతూ దొంగోడి కదలికలో ప్రతి చిన్న వొంపూ పరిశీలనగా చూస్తున్నాడు జవాను వెంకటప్పయ్య. "మీ అమ్మాయా బాబూ" అన్నాడు జకరయ్య. నాగులువంక అప్యాయంగా చూస్తూ. తల పంకించాడు వెంకటప్పయ్య అనుమానంగా. "బువ్వ తిన్నావా బుల్లెమ్మా" అని పలకరించాడు జకరయ్య. నాగులు బెదురుతో చూచింది వెంకటప్పయ్య వోరకంట చూస్తూ కూచున్నాడు, "పిల్లని లాలిస్తున్నా నాకన్ను నీమీదనే వున్నదుస్మీ" అని అర్ధమయ్యేలా. జకరయ్య నాగులువంక అమాయికంగా చూస్తూ "బుల్లెమ్మా ఇటురా అమ్మా" అని పిలిచాడు. పిలిచి బిసకొత్తు లిచ్చాడు. ఇచ్చి కూచోమ్మా అని ముద్దుచేస్తున్నాడు. దొంగ వెధవ! వెయ్యికళ్లతో కనిపెడుతున్నాడెప్పుడు. ఎవళ్లచేత తెప్పించుకొంటాడో బిసకొత్తులనీ, పకోడీలనీ, బఠానీలనీ, ఏవో నముల్తోనే వుంటాడు వాడు. బిసకొత్తు చేతిలో పడగానే జకరయ్య గుబురుమీసాలూ, వుంగరాలజుత్తూ వికృతంగా అవుపడ్డం మానుకుని అతి సౌమ్యంగా మారిపోయి కనిపించాడు నాగులుకి. వెంకటప్పయ్య పరకాయించి చూసాడు తన పిల్లని ఎవరైనా ముద్దుచేస్తుంటే వాళ్లమీద అకారణంగా అభిమానం పుట్టుకొస్తుందతనికి. పిల్లల్ని కన్న తల్లిదండ్రులకి అదొక దౌర్బల్యం. వెంకటప్పయ్య ముఖం సానుభూతిగా వికాసం పొందింది. నవ్వుకున్నాడు.

జకరయ్యగాడికి పిల్ల లుండివుంటారు బహుశా. రాత్రి తాను పహరా యిస్తున్న సెంట్రీ. వాడు పారిపోతున్న గజదొంగ. ఇప్పుడు తాను గృహస్తు. వాడొక పిల్లలుగల సంసారి. చిత్రం ప్రపంచం ఎట్లాచూస్తే అట్లా మారుతుంది. దయగా చూస్తే ఎదుటివాడు దీనంగా, జాలికరంగా అవుపిస్తాడు. క్రూరంగా చూస్తే దగుల్బాజీ, ఝూటాకోర్, స్కౌండ్రెల్ అనిపిస్తుంది. ఆ దొంగవెధవప్పుడే నాగులుతో ఏవేవో తొక్కు పలుకులు కలిపేస్తున్నాడు. వాడి లాలనా, వాడి లబ్జూ ఎంతో సహజంగా వున్నాయి. బుల్లెమ్మా అంటున్నాడు. బోశమ్మా అంటున్నాడు చిట్టెమ్మా అంటున్నాడు. జేజమ్మా అంటున్నాడు. వొచ్చీరాని మాటల్తో అది సమాధానమిస్తుంటే బుంగమూతి పెట్టి అసంపూర్తిగా వొస్తున్న జవాబుని తలపంకింపుతోనో చేయివూపుతోనో భర్తీచేసుకొంటో మహానందం పొందుతున్నాడు. "నీకు పిల్లలెంతమందిరా" అని అడిగాడు వెంకటప్పయ్య. చిత్రం, వాడికీ అయిదుగురే పిల్లలట. తనకీ అయిదుగురే. వాడికి ముగ్గురు మగపిల్లలూ, ఇద్దరాడపిల్లలూ. తనకి ఇద్దరు మగపిల్లలూ, ముగ్గురు ఆడపిల్లలూ అంతే తేడా.

ఖయిదీని రిలీఫ్‌సెంట్రీకి వప్పగిస్తోవెళ్ళిపోతున్నాడు వెంకటప్పయ్య. నాగులూ, జకరయ్యా ఏదో దయలారులో పడ్డారు. నాగుల్ని "రామ్మా" అని రెక్కపట్టుకుని వెళ్లిపోతో "వొరేయ్ రాస్కెల్ - రాత్రి - నా పొట్టమీదా ఆ పిల్లకాయ పొట్టమీదా కొట్టేవాడివేస్మీ" అన్నాడు వెంకటప్పయ్య. "వోరయ్యా - ఈ బుల్లెమ్మ పొట్టే? ఆ పొట్టలో ఏ సరికిలున్నాడో, ఏ సుబేదారు కవాతు నేరుపుతున్నాడో? యాంతల్లీ?" అని చేతులు తిప్పుతో వో చిన్న సిపాయి పోజిచ్చి కటకటాలవెనక నిలబడ్డాడు జకరయ్య. నాగులు నవ్వి పొట్ట నిమిరి చూచుకుంది. లోపల పొద్దుట చద్దెన్నంలో తిన్న వెల్లుల్లిపాయ, ఆవకాయ ముక్కలు మినహా ఇంకేమీ స్ఫురించలేదా పసికందుకి.

వెంకటప్పయ్యకి డ్యూటీ చాలాసార్లు మారింది. సెంట్రీగా రెండు మూడు సార్లు నిలబడ్డాడు కూడా.

డ్యూటీ ఏదయినా మధ్యాన్నమో ప్రొద్దుటనో నాన్నకి కాఫీ తీసుకొచ్చే పని నాగులికి తప్పదు. వొచ్చినప్పుడల్లా జకరయ్యని చూడకుండా వెళ్లదు. జకరయ్య తప్పించుకుని వెళ్లనీడు. అడపా తడపా తమ్ముణ్ణి తీసుకొచ్చేది. వాళ్లిద్దర్నీ "హూష్‌కాకీ" అంటాడు. పారేసిన బిస్కట్లు చేతిలోకి తెప్పించి చెరిసగంపెట్టి మాయగారడీలతో నవ్వించేవాడు. కాయితాలు తెచ్చేది. పుస్తకాలు కుట్టియిచ్చేవాడు. పడవలూ గాలిపటాలు కట్టిపెట్టేవాడు. రూళ్లు వేసేవాడు. దాగుడు ముచ్చీ లాడేవాడు కటకటాలవెనక వాడూ ఇవతల నాగులూ.

వెంకటప్పయ్య జకరయ్యని చాలాసార్లు పలకరించాడు.

తను సెంట్రీగావున్నప్పుడు తప్ప జకరయ్య మహామందకొడి. వొట్టప్పుడు నల్లమందు భాయిలా పండుకుంటాడు అంతే. రేవులో నల్లరాతి బండలా వులకడు పలకడు. అప్పుడు ఒకచలనమూ చైతన్యమూ వున్నట్టే కనపడదు వాడిలో. నాగులు కనిపించగానే మాత్రం పోయిన ప్రాణం తిరిగి వొచ్చినట్టవుతుంది వాడికి. ఆ పిల్లకాయ అక్కడున్నంతసేపూ వాడూ వొక పసిపిల్లడైపోయి, రోజంతా తనక్కావలసిన వుల్లాసమూ ఆనందమూ అంతా ఆ గడియసేపూ నొల్లేసుకుని, నెరమువేసుకొంటో తక్కిన టయిమంతా గుంభనగా పండుకుని వుండిపోతాడా

అనిపిస్తుంది.

"నాకూ నాగులమ్మంత కన్నతల్లి వొకతివుంది బాబయ్యా" అన్నా డొకనాడు మాటల సందున. స్టేషనికి వొస్తున్న సబిన్స్పెక్టరుకి ఎటెన్షవుతూ వినిపించుకోలేదు వెంకటప్పయ్య. నాగులికి మేనరికమున్నదనీ వాళ్ల స్థితిగతులూ గట్టా వివరిస్తో బాతాఖానీలో పడ్డాడు వెంకటప్పయ్య. కుప్పనూర్పిళ్ళప్పుడు పొలం చెలకల మధ్య పాకలో తను పండుకొని వుండిపోతే తెల్లారగట్ల దుత్తగిన్నెతో చద్దికూడు పట్టుకొచ్చి కడెం వెనకాతలనించీ కంకులమీదకి విసిరి నిదరలేపి కలకలానవ్వే తన కూతురు చేష్టలు వర్ణిస్తున్నాడు జకరయ్య. దాన్ని మిడిల్స్కూలులో జేరిపించాడట. మహామాటకారట. ఎంత పెద్ద పాఠమయినా గడగడ అప్పగించేస్తుందట. ఇస్కోలు మేష్టరమ్మకి తన కూతురంటే మహాప్రీతంట. మురిసిపోతున్నాడు. వొకటేమిటి ఏదో పెద్ద సదువే సదివేస్తుందట. గాలిలో మేడలు కట్టేసి, రంగులువేసి, పంకాలు వొదిలి స్ప్రింగ్ కుషన్లమీద తన కూతుర్ని చూచుకుని పొంగిపోయాడు జకరయ్య – తానున్నది పోలీసు లాకప్పున్న సంగతి మర్చిపోయి వెంకటప్పయ్య ముసిముసిగా నవ్వుకున్నాడు తన కూతురు భవిష్యత్తును గురించి తాను కంటున్న బంగారు కలలు గుర్తుకొచ్చాయి.

ఆనాడు 'వెట్ ఇన్స్పెక్ష' నుంది. వెంకటప్పయ్య గుండీలు తోముకొంటూ కూచున్నాడు. లాకప్లోనించీ జకరయ్య అందరినీ పలకరించాడు. మాటల మధ్య వో తెలివైన ప్రశ్న వేశాడు. నేనుగాని పారిపోతే మీకుయామవుతుందేటి బాబూ" అన్నాడు అమాయకంగా. పక్కున నవ్వారంతా "వోరి నీదుంపతెగా మంచి ప్రశ్నేవేశావు. ఉద్యోగం వూడుతుంది తెలుసా" అన్నాడు సెక్షన్ హెడ్ కానిస్టేబిల్. "పింఛను రద్దవుతుంది, సర్వీసంతా బుగ్గిపాలవుతుంది – చాలా?" అని సీరియస్గా మొహం పెట్టాడు బీటు కానిస్టేబుల్ 406" "ఖయిదీతో లాలోచీ అయినాదన్న నేరంమీద ప్రాసిక్యూట్చేసి కేసు బనాయించి నువ్వు ఖాళీచేసిన జైలులోకి మమ్మల్ని నెడతారురా నాయనా" అని దీనంగా చెప్పుకున్నట్టు నటించాడు ఎస్కార్టునించీ తిరిగివొచ్చి ప్యాస్పోర్టు ఇచ్చిపోతున్న వొక మఫ్టీ జవాను. "వోరబ్బా అంతమాత్తరానికే?" అని అలవోకగా చూసాడు జకరయ్య. క్లీన్చేస్తున్న తుపాకీలోనించీ 'పుల్ త్రూ' బైటికిలాగుతో "మరేమిటనుకున్నావురా బాబూ?" అని హెచ్చరించాడు జవాను వెంకటప్పయ్య.

రాత్రి నిశ్శబ్దంగావుంది. సబిన్స్పెక్టరు వెళ్లిపోయాడు. రైటరు కాయితాలు డ్రాయర్లోకి తోసి తాళాలు వేసుకుని చక్కాబోయాడు. సార్జెంటు బీటు జవాన్ల పుస్తకాలు వొకటొకటీ సంతకాలుచేసి డ్యూటీలు వేసి లారీలమీద ఓవర్లోడ్ చెకింగుకని వెళ్లిపోయాడు. వెంకటప్పయ్య సెంట్రీ డ్యూటీమీద వుండిపోయాడు. దూరాన జనార్దనస్వామి గుడిలో గంటలు మోగుతున్నాయి. జకరయ్య నిదరపోతున్నట్టు లేదు. ఎందుకనో నలతగా మసులుతున్నాడు. "నిదరపట్టలేదట్రా?" అని పలకరించాడు వెంకటప్పయ్య.

"లేదు బాబూ"

"ఏ? – ఇంటిమీద ధ్యాసంపారిందా యేం?" ముసిముసిగా నవ్వాడు జకరయ్య 'అంతే' నన్నట్టు. ఆవేళ సబిన్స్పెక్టరు సారావూట జప్తుకని పార్టీని తీసికెళ్లాడు. సర్కిల్ కూనీకేసు దర్యాప్తుకని

వెళ్లిపోయాడు. పెద్ద హెడ్డు వుత్సవం వూరేగింపులో బందోబస్తులో వున్నాడు. స్టేషను చెకింగుకని గమ్మున వొచ్చే ఆఫీసరులెవరూ కనిపించరు. తుపాకీ గోడకానించి లాకప్ ముందు బైఠాయించాడు సెంట్రీ వెంకటప్పయ్య. నిక్కరు జేబులోనించీ లంక పొగాకు బొండుతీసి రెండు చుట్టలు చుట్టాడు. వొకటి తను వెలిగించుకున్నాడు. రెండోది జకరయ్యకిచ్చాడు. అగ్గిపుల్ల తనే వెలిగించాడు. ఇక కష్టసుఖాలు చెప్పుకుంటో కూచున్నారిద్దరూనూ.

ఒకటి: కునికిపాట్లు రావు; రెండు: ఎవడికోసం తను కాపలా వున్నాడో ఆ ఆసామీ సాక్షాత్తూ కళ్ల యెదుట కనిపిస్తుంటాడు, అన్న దిలాసాగా వుంది వెంకటప్పయ్యకి.

ఇద్దరిమధ్యా చాలా సంగతులు దొర్లిపోయాయి. వెంకటప్పయ్య పెద్దపిల్లల ఇద్దరికీ పెళ్ళిళ్ళయిపోయాయి. కాపరానికి వెళ్ళిపోయారు. పెద్దాడు రౌడీగా తిరుగుతున్నాడు. వార్ధక్యంలో ఏమన్నా కాచిపోస్తే రెండోవాడే కాచిపోయాలి. వాడిని గవర్నమెంట్ స్కాలర్‌షిప్‌మీద చదివిస్తున్నాడు. మరి దేవుడు మేలుచేస్తే – ఒచ్చేయేడు సబిన్స్పెక్టరు సెలక్షనికి నిలవాలని వుంది. తను చాలామంది దొరలదగ్గర పనిచేసాడు. కాళ్లూ, కడుపులూ పట్టుకుని ఎట్లాగో వాణ్ణి పైకి తీసుకు రాగలనన్న ధైర్యం వెంకటప్పయ్యకి. ఈ సర్వీసు చూడబోతే నానా యాతనగానూ వున్నది. ఇదివరకు ఆఫీసర్లు చాతనయితే నేరుగా ప్రజలమీదపడి నొల్లుకు తినేవారు. ఇప్పుడు ఆఫీసర్లకి తాబేదార్లద్వారా తినాలన్న వాడుపే. శక్తి లేక. నొల్లి తెచ్చిందంతా గుంభనంగా దిగమ్రింగడం. తికమక వస్తే కిందవాళ్ళమీద రుద్దిపారేసి తాము సరైన ఆఫీసర్లల్లే కొంగజపం చేస్తూ వుంటారు. జకరయ్యకి చాలా సంగతులు తెలిసాయి. వాడికి సరేసరి. పిల్లలంతా చిన్నా చితుకూ. రెక్కాడితేగాని డొక్కాడదు. శ్రమించినా తీరని దరిద్రాన్ని శ్రమలేకుండా తీర్చుకుందామనుకున్నాడు. చౌదరీ దగ్గర పొలం దుక్కికి తీసుకున్నాడు బకాయి పడ్డాడు. అప్పు తీసుకున్నాడు. వాయిదాలమీద వాయిదాలు పెరిగిన్నై. అదేమి లెఖ్ఖో ఎంతకీ తీరదు. ఓ దుర్బుద్ధి పుట్టింది. ఆయనింటోనే దూరి ఆయన బాకీ తీరుద్దామనుకున్నాడు కన్నం ఫేసాడు. పాచిక పారలేదు. వెంకటప్పయ్యకి దొరికినట్టే చౌదరికీ దొరికాడు. భార్యాపిల్లలూ ఎక్కడున్నారో దేముడి కెరుక. నా అన్నవాళ్ళు లేరు. దిక్కులేని పక్షుల్ని చేసి ఒదిలివచ్చాడు. ఆ మూడో పిల్ల. అదంటేవాడికి ప్రాణం తెల్లారగట్ట దాని కేరింతలు వినిపిస్తాయి దూరాన్నించీ. కళ్లు చెమ్మగిల్లాయి వెంకటప్పయ్యకి. – ఎవరి ఖర్మకి ఫెవరు కర్తలు నాయనా. కళ్లు మూసుకో, నాతోపాటు నీకూ జాగారమెందుకు" అని వెంకటప్పయ్య తుపాకీ అందుకుని స్టాండ్ ఎట్ ఈజ్‌లో నిలబడ్డాడు సెంట్రీగా.

మర్నాడు జకరయ్యని అవతలి జిల్లా పోలీసు స్టేషనికి బదలాయించాలి. జవాను వెంకటప్పయ్యకీ, ఆ జిల్లా రిజర్వు జవానొకతనికీ ఎస్కార్టు డ్యూటీ పడింది. అడంగుకి చేరుకున్నారు. కొనని ఓ చిన్న బస్సు ప్రయాణం చెయ్యాలిసి వుంది. రిజర్వు జనాన్ని 'డిప్టీ' అర్జంటుగా ఒక 'రెయిడ్'కి ఆసరాగా తీసుకున్నాడు. కండక్టరు బస్సు ఓవర్ లోడ్ వేశాడు. డ్రైవరు జల్సాగా వున్నాడు. బస్సు హటాత్తుగా ఒక పెద్ద మర్రిచెట్టుకి డీకొట్టి బోల్తా కొట్టింది. అంతవరకేతెలుసు వెంకటప్పయ్యకి.

స్పృహ ఎప్పుడొచ్చిందో, ఎక్కడొచ్చిందో అతనికే తెలియదు. కళ్లు తెరుపులు బడగానే

ఇంటోవున్న శివుడి పటం కనిపించిందనుకున్నాడు. మెడలో పాములు బుస్సుమన్నాయి. ఆ పటంలోనించీ నల్ల తాచుల్ని మెడలో వేసుకుని తెల్లని సూట్లతో ఎవరో తచ్చాడుతున్నట్టయింది. పక్కని రవివర్మ వేసిన నలదమయంతి బొమ్మలోని హంస రెక్కలలోంచి తెల్లని మజిలిను హుడ్లు తెరచాప తెడ్లల్లే, వాలునీటిని తెల్ల కలవపూలల్లే మసక మసగ్గా తేలి కనిపించినై. కళ్ళు నులుముకున్నాడు డాక్టర్లూ, నర్సులూ! ఆసుపత్రిలో వున్నాననుకున్నాడు అంతా కలివిడిగా వున్నది. వార్డంతా ఫినాయిలు వాసన వేస్తోంది. టేబిలుమీద గాజుపీసులు దూదిపింజలు... నర్సులూ, వార్డు బోయిలూ, బ్లడ్ ప్రషర్ యాపరేటస్సులతోటీ, మందుసీసాలతోటీ అదావుడిగా – తిరుగుతున్నారు. ఒరిగిన గాంధీ టోపీలతో మగ నర్సులూ, వెనకాల కలకలలాడుతూ, బిలబిలలాడుతూ పడగవిప్పిన తెల్లతాచులల్లే సివంగినడకల చిన్నారి నర్సులు... స్టాఫ్‌జీ, స్టాఫ్‌జీ అంటూ ఒకళ్లచుట్టూ ఒకళ్లు కొంగుముడులు లేకుండా ప్రదక్షిణాలు చేస్తున్నారు. మూలుగుతో వున్న రోగుల్ని మినహాయిస్తే ఆసుపత్రి కలకలలాడే కళ్యాణమండపంలా వున్నది. ఈ గందరగోళంలోనించీ విడిపడి జవాను వెంకటప్పయ్య మనస్సు జకరయ్యకోసం వెతుక్కుంటోంది. అవును. ఏమయ్యాడు? అడుగుదామంటే నోరు పెగిలిరావడం లేదు. ఓపిక లేదు. కణతలమీదా, నొసలమీదా సన్నని కోత!... గాయాలు తగిలినై గావును అనుకొన్నాడు. కాలికి బ్యాండేజిమీద నెత్తురు మరకలు! కళ్ళు జిగ్గుమన్నాయి.

జకరయ్య ఏమయినాడో? కొంప మునిగింది.

డాక్టరు ఒచ్చాడు. నిశ్శబ్దంగా పడుకోమన్నాడు. నర్సు సీతాయమ్మనడిగాడు. 'ఖయిదీ ఎవరబ్బా' అని సుతారంగా అడిగింది. 'ఆ పోజ్ బాగుంది' అన్నాడు స్టాఫ్‌నర్స్ శంకరగిరి, కావలసిన హంశం ఒదిలేసి. వెంకటప్పయ్యకి గాబరా పుట్టింది.

ఎవళ్ళ గొడవలో వాళ్ళున్నారు. పగిలిన సీసా అజాగర్తగా వుంచిన మూలాన కబోర్డంతా నీటివరదయిందని హెడ్ సిస్టరమ్మ నర్సింగ్ ఆర్డర్లీని కూకలేస్తోంది. 'సెన్సస్' అంటే రోగుల జనాభాలెఖ్ఖ కుదరక మగనర్స్ మహిపాలసింగూ, ఆడనర్సు అరవిందా తికమక పడుతున్నారు. ఆవిడ పక్కనుంటేగాని, ఆయనగారికి ఆ లెక్క ఓ పట్టాన్ని తెమలదు.

వెంకటప్పయ్యకి వీరదాహం వేస్తోంది. ఎవ్వరూ మంచినీళ్లివ్వరు.

'ఖయిదీ ఖయిదీ' అని కేకలేసాడు. అంతా చుట్టూ చేరారు.

"ఇందాకటినించి నీ పక్క సర్ది, తలగడా అమిర్చి, బ్లాన్‌కెట్ కప్పి వెడతా ఎవరూ" అని అడిగాడు తోటీ రాములు.

"పొట్టిగా, నల్లగా తుండులా వుంటాడు కదూ."

"ఆఁ, ఆ వాడేవాడే అతినమ్మకంగా జారిపోయాడే – నీ తమ్ముడో, అన్నయ్యో అనుకుంటిమిస్మీ."

ఎవరిదారిన వారు చక్కా బొయ్యారు.

వెంకటప్పయ్య నిరాశ చేసుకున్నా డిహను. ఆ నిస్సత్తువలో, బిక్క మొహంలోంచి బుడిబుడి దుఃఖాలలోకి దిగజారిపోయాడు. ఆ గడియలో అతను పోలీసు జవానంటే ఎవ్వడికీ నమ్మకం కుదరదు. దొంగని వెతికేందుకూ ఆస్కారం లేకపోయెను. ఎరిగున్న మొహమొక్కటీ అవుపించదు. ఖంగా రెక్కువయింది.

ఇంకేముంది. వాడెన్నాళ్లనుంచో వల పన్నుకుని కూచున్నాడు. ఆ సాలీడు గూడులో ఈగలా వాలాడు తను. ఇన్నాళ్లనించీ తనతో సాగించిన చనువూ, స్నేహమూ ఇందుకే అయివుంటుంది. లాకప్‌లోనించీ కచ్చితమైన పహరాలోనించీ పారిపోయిన గజదొంగ ఎస్కార్టు జవాను స్పృహతప్పి పడిపోయివుంటే, చుట్టూ వేళ్లాడుతో కూచుంటాడా? తనకి ఏ దగ్గర బంధువులాగానో, ఏ అన్నాయిలాగానో నటించి, అస్తారు బత్తంగా శుశ్రూష చేసినట్టుచేసి అతి సహజంగా, అతి పెద్దమనిషి తరహాగా చక్కాబోయాడు జకరయ్య. తన కొంప ముంచాడు. ఈ దొంగ వెధవలు ఎన్నివేషాలు వేస్తారో, ఎన్ని జిత్తులు పన్నుతారో తన ఇరవై ఏళ్ల సర్వీసులోనూ ఒంటిబట్టించుకునీకూడా మందబుద్ధి అయిపోయింది అతనికి అట్లాంటి నటనాకౌశలం చూపాడు మరి. పోలీసు ఇన్‌ట్రాగేషన్‌లో కూడా బయటపెట్టని గుట్లూ మట్లూ తనకి చెప్పినట్టు నటించాడు మరి. తాను ఫలానా అని స్నేహభావంలో తనకు సూచనగా అందించిన వివరాలెంతవరకూ నిజమో తనకు తెలియదు. వాడితో తను అతి చనువుగా, సన్నిహితంగా మాట్లాడడమూ, సంచరించడమూ చాలామంది జవాన్లెరుగుదురు తను వాడితో లాలూచీ అయినట్టు రుజువుకావడం అతి సులభమని స్ఫురించింది. ఇంకేముంది, తన కొంప ముంచేసాడు తన యింట్లో దీపమారిపే శాడు. ఇహ ఉద్యోగం కాస్తా ఊడినట్టే. ఈ పిల్లలనెట్లా పెంచేదీ, ఎట్లా బ్రతుకీడ్చేది. ఈ వార్ధక్యంలో తనకీ పిల్లలేమిటీ? ఉక్కిరిబిక్కిరవుతున్నాడు వెంకటప్పయ్య - ఎంత సముదాయించినా వినడు తన ధోరణి మానడు.

"అదుగదుగో, వాడేనా" అని వేలుపెట్టి చూపింది ఆయా గురవమ్మ. పరకాయించి చూసాడు వెంకటప్పయ్య - జకరయ్యే! ఒగురుస్తో వస్తున్నాడు పాపం. ఒక చేతిలో ధర్మాఫాస్కు, మరో చేతిలో ఇటాలియన్ రగ్గూ - వెంకటప్పయ్య తన కళ్ళు తాను నమ్మలేకపోయాడు.

అతనొక ఖయిదీనా అతనిని ఆ జయిలునించీ ఇంకో జెయిలుకి ఎస్కార్టు చేస్తున్న పోలీసు జవానా యితను" అంతా విస్తుపోయారు.

జకరయ్య వచ్చి తాపీగా కూచున్నాడు."ఇది యేమాసుపత్రి జవానియ్యగారూ ఓరూ మాట్లాడరు, దాగమైపోతన్నది, కసిన్ని గంగ యిప్పియ్యండయ్యా అంటే సెవినెట్టరు బాబులు. ఒటేలికెళ్ళి కాపీ వొట్టుగొచ్చా నింద వెంకటప్పయ్యబాబూ ఇంద - బేసైన నీలగిరి కాపీనెగండె" అని పక్కమీద కూచుని మూతతీసి కాఫీ చల్లార్చాడు జకరయ్య. వాడి ధోరణికి అంతా నవ్వారు. "గోయిందని మావోడొకడున్నడు లెండి. కారకానాలో పనిసేస్తన్నడు. ఆడూ, నేనూ మిలట్రీలో డేరాడూన్‌తో పనిసేసినం లెండి. లగెత్తికెళ్ళి మెత్తటి రగ్గు సిక్కించుకుని వొచ్చినా, కప్పనీ బాబూ" అని జకరయ్య మెల్లిగా రగ్గుకప్పి పందుకో బెట్టాడు. వెంకటప్పయ్య లేవబోయాడు. "కదలమాకు, కదలమాకు"మని మీద చేయివేశాడు జకరయ్య. చెమట తుడిచాడు. "ఎట్లా వుంది బాబూ"

అని మొహంలో మొహంపెట్టి ఆత్రంగా అడిగాడు. "ఏమిటోయ్, ఖంగారు పడిపోయావూ" అని వెళ్ళిపోయాడు డాక్టరు వెటకారంగా.

వెంకటప్పయ్య అవమానంతో క్రుంగిపోయాడు లోలోపల. జకరయ్య తన పిల్లల మొహంచూచి వుండిపోయాడు. వాడి వూరూ, పేరూ పోలీసుల కింకా తెలియదు. పారిపోతే మరి దొరికే ఆస్కారం అసలు లేదు. కాని, వుండిపోయాడు. తనకి సరేసరి – తన వుద్యోగానికి రాగల ప్రమాదం తప్ప దిక్కూదివాణమూ లేని వాడి భార్యాపిల్లల గోడు తనకి పట్టనేలేదు. ఆ మిడిగుడ్ల వెనక, ముళ్లమీసాల చాటున, ఆ రాక్షసిరూపం మాటున ఎంత మెత్తని గుండె కొట్టుకుంటోందో జవాను వెంకటప్పయ్యకి చట్టుని మెరిసింది. ఛ! ఒక గజదొంగ చూపగలిగిన ఔదార్యం తను చూపలేకపోయాడా?

బస్సు ప్రమాదం ఒచ్చింది. గాయాలతో తను స్పృహతప్పి పడిపోయాడు. 'ఖయిదీ ఏమయ్యాడో నాకు తెలియదు' అంటే, తన నేరం కమ్ముకుపోవడానికెంతైనా సావకాశముంది. అంతకుముందే 'స్ట్రెచ్చర్ కేరియర్' గోపాలంతో చెప్పి టెలిగ్రాం ఫారమొకటి తెప్పించాడు. "దొంగ పారిపోయాడు" అని వ్రాయించి రెడీగా వుంచారుకూడా. ఆ టెలిగ్రామట్లానే పంపించేస్తే సరిపోదా అనిపించింది. కాని, డ్యూటీ! వాడేమంటాడో చూదామనిపించింది. జకరయ్యని దగ్గరికి పిలిచి చెవిలో "ఒరేయ్, పారిపో – నేను సమర్థించుకుంటాలే" అని వూదాడు రహస్యంగా. జకరయ్య కాఫీ కలబోస్తూ "ఓరయ్యో, నీ కెందుకు నెగవయ్య జవానియ్య సిక్కుల్లో పడతావు. ఆఫీసర్లు మాసెడ్డోరు నువ్వు సెబితివి గద, మా తిక్క మదుసులనీ" అంటూనే "కాఫీ ఇంద" అని అందించి, బేడీలు తీసి తగిలించుకున్నాడు.